అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



మంత్రి శ్రీధర్‌బాబుతో బొనగిరి సురేష్‌యాదవ్

మల్కాజిగిరి: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును మల్కాజిగిరికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, ఏసీసీసీ ఓబీసీ విభాగం మాజీ నాయకుడు బొనగిరి సురేష్‌యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా శ్రీధర్‌బాబు ఉన్నారని, మల్కాజిగిరిలో ఉన్న పలు పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. పరిశ్రమలు, వాణిజ్యశాఖలు కూడా ఆయన పరిధిలోనే ఉండటంతో నూతన పరిశ్రమల ఏర్పాటులో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరినట్లు చెప్పారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ భవానీనగర్ (ఈస్ట్)లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో మురుగునీటి పైపులైన్ పాతవి కావడంతో ఇబ్బందులు పడుతున్నామని, నూతన పైపులైన్ వేయాలని కోరారు. అదేవిధంగా తాగునీటి పైపులైన్లు వేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాలనీ అధ్యక్షుడు నాగరాజు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



ఉప్పల్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి పర్యటించారు. స్థానికులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓల్డ్ భరత్‌నగర్‌లో రూ. 58 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రజలకు ఇబ్బంది కలగకుండా గడువులోగా పూర్తి చేయించాలని ఏఈ రాజ్ కుమార్‌కు సూచించారు. డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, ఈగ ఆంజనేయులు, రఘునాథ్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

నగర తొలి మేయర్‌కు ఘన నివాళి

గౌతంనగర్: నగర తొలి మేయర్ కృష్ణస్వామి ముదిరాజ్ 132వ జయంతి వేడుకలు శనివారం మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం భవనంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం నేతలు మహేష్‌ముదిరాజ్, సత్యనారాయణ, మల్లయ్య, యాదగిరి, శోభన్‌బాబు, గణేష్, రమేష్, ఆనంద్, శివ పాల్గొన్నారు.

ఆచూకీ లభ్యం

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



అల్వాల్: తప్పిపోయిన బాలుడిని నేరేడ్‌మెట్ పోలీసులు తల్లి దండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నిర్మల్‌నగర్‌లో 11 ఏళ్ల బాలుడు తప్పిపోయి తిరుగుతుండగా.. స్థానికులు పోలీసులకు అప్పగించారు. సదరు బాలుడికి సరిగ్గా మాటలు రాకపోవడంతో అతడి తల్లిదండ్రుల వివరాలు తెలియరాలేదు. అనంతరం పెట్రోల్ వెహికల్ ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ రామస్వామి బాలుడి ఫోటోతో స్థానికుల ద్వారా బాలుడి వివరాలు తెలుసుకుని ఏఎస్‌రావునగర్ భవానీనగర్‌కు చెందినట్లు గుర్తించి తల్లి మానికరెడ్డికి బాలుడిని అప్పగించారు. బాలుడిని అప్పగించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపై కత్తులతో యువకుల హల్ చల్..

భయాందోళనలో స్థానికులు

రామంతాపూర్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ రామంతాపూర్‌లో గంజాయి బ్యాచ్ కత్తులను చేత బట్టి రోడ్డుపై వీరంగం సృష్టించారు. దారి వెంబడి వెళ్లే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ.. పెద్దగా అరుస్తూ నానా హంగామా సృష్టించారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు వివరించారు.

కృష్ణం వందే జగద్గురుమ్ !



అల్వాల్‌లో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపిక, సత్యభామల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలుచోట్ల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతా హారతి, భగవద్గీత విశిష్టతను పలువురు వక్తలు వివరించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో పలు కాలనీవాసులు ఉల్లాసంగా గడిపారు. – ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం





శ్రీకృష్ణ, గోపిక వేషాధారణలో..





శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



శ్రీనికేతన్ స్కూల్‌లో..



న్యూ నర్సింహ్మనగర్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్



జేజీఆర్ స్కూల్‌లో..



సరస్వతి ప్లే స్కూల్‌లో రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత



జన్మాష్టమి వేడుకల్లో బీజేపీ నేత ఏనుగు సుదర్శన్‌రెడ్డి



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

‘బీసీల అభివృద్ధికి పాటుపడే పార్టీ కాంగ్రెస్’

ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



నరేందర్‌రెడ్డితో యూత్ కాంగ్రెస్ నేతలు

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌పటేల్‌తో కలిసి యూత్ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డిని కలిశారు. బీసీలకు 42 శాతం విద్య ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల బిల్లులకు చట్టబద్ధత కల్పించడం, అసెంబ్లీలో ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఈ సందర్భంగా శనివారం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బడుగు, బలహీన వర్గాలు వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందని, రాష్ట్రంలో వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలు ముందుకొచ్చి పోటీ చేసేలా బీసీ సంఘాలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌యాదవ్, రామకృష్ణ, భాస్కర్ తదితరులున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

బోడుప్పల్: న్యూటన్ గ్రామర్ హైస్కూల్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను స్కూల్ కరస్పాండెంట్ రాంచంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివేదిత, వర్షకు రూ.10 వేలు, వినోద్‌కుమార్‌కు రూ. 4,000, సాయివర్ధని, శివాని, సీహెచ్.విశాల్‌కు రూ.2,500ల చొప్పున అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ, స్కూల్ ఇన్‌చార్జ్‌లు జితేందర్‌రెడ్డి, మిస్పారాణి, లూసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కార్పొరేటర్ శ్రీవాణి



యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: డివిజన్ పరిధిలో వెంకట్‌సాయినగర్‌లో రూ.30లక్షలతో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా డివిజన్‌లోని కొన్ని బస్తీల్లో భూగర్భ డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, భూగర్భ డ్రైనేజీలు లేని బస్తీలు కాలనీలను గుర్తించి వెంటనే యూజీడీలో నిర్మిస్తున్నామన్నారు. భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సంక్షేమ సంఘం నేతలు నిరంజన్‌గౌడ్, నగేష్, బాల్‌రాజ్, నాగరాజ్, చందన్‌సింగ్, మోహన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మల్లాపూర్: రెడ్‌క్రాస్ సొసైటీ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం మల్లాపూర్ ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ వయోవృద్ధులు, మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు శిఫా, నర్సు శాంతి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చౌదరి, కేశవరం ఆంజనేయులు, రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందాలి..

బోడుప్పల్: ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని చెంగిచర్ల 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ అన్నారు. శనివారం చెంగిచర్లలోని అరవింద ఎన్‌క్లేవ్‌లో కాలనీ అధ్యక్షులు చిన్న ముదిరాజ్, హ్యాండ్స్ ఆఫ్ మెర్సీ మినిస్ట్రీస్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. కాలనీవాసులు తదితరులున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

మేడిపల్లి: బహిరంగ ప్రదేశంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న సంపత్‌కుమార్, బత్తిని అజయ్‌లు స్థానికంగా ఉన్న ఓ వైన్స్ షాపులో మద్యం సీసాలను కొనుగోలు చేసి అధిక ధరకు బహిరంగ ప్రదేశాల్లో అక్రమంగా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు శుక్రవారం రాత్రి ఆ ప్రదేశంపై దాడి చేసి మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం




పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్: ఉప్పల్‌లో భారీగా గంజాయిని ఎక్సైజ్ పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి ఉప్పల్ భగాయత్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు అనుమానితులు ఉప్పల్ భగాయత్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. సంగారెడ్డి జిన్నారం ప్రాంతానికి చెందిన శివ, అదే గ్రామానికి చెందిన ముకేష్ కుమార్‌లు ఇద్దరు ఐడీఏ బొల్లారంలో నివాసం ఉంటున్నారు. ఒడిశా నుంచి కిలోకు రూ.3000 చొప్పున గంజాయిని ఆర్టీసీ బస్సుల్లో తీసుకొచ్చి నగరంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన వారికి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తుంటారు. వీరి వద్ద నుంచి 1.120 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ఆపరేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఓంకార్, ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త !

కరెంట్ తీగల కంటే ఇంటర్నెట్ కేబుల్, టీవీ వైర్లే అధికం

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



జెండా బస్తీలో ప్రమాదకరంగా ..

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కొన్ని బస్తీలు, కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఒంగిపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీస్తే ఈ స్తంభాలు పడిపోయే స్థితిలో ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు.

- డివిజన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో వీధి నెంబర్ 3, 6, 15తో పాటు పాత రామంతాపూర్‌లోని చాకలిబస్తీ, చిన్న జెండా బస్తీల్లో దాదాపు 20 ఏళ్ల క్రితం వేసిన పాత స్తంభాలే ఉండటం వల్ల అవి ఒంగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి.

50 నుంచి 100 కేజీల కేబుళ్లు..

ఈ స్తంభాల నుంచి కేవలం విద్యుత్ సరఫరా చేయడానికి వైర్లు మాత్రమే కాకుండా దాదాపు ఒక్కో స్తంభానికి 50 నుంచి 100 కేజీల బరువు కలిగిన ప్రైవేట్ సంస్థలకు చెందిన ఇంటర్నెట్, కేబుల్ టీవీ వైర్లు కిందకు వేలాడదీసి ఉన్నాయి. దీంతో ఈ స్తంభాలపై భారం పడి పలుచోట్ల మధ్యలో విరిగిపోయి ఒంగిపోయాయి.

వర్షంతో ఇబ్బంది..

అసలే వర్షాకాలం, ఈ స్తంభాల పరిసర ప్రాంతాల్లో ఉన్న భూమి తడిగా ఉంటుంది. స్తంభాలకు ఆనుకుని తీగతో కూడిన చెట్లు, పొదలు ఉండటం వల్ల ఈ విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని సంక్షేమ సంఘం నేతలు చెబుతున్నారు.

పరిష్కార మార్గాలు..

10 నుంచి 20 ఏళ్ల కింద వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలి. స్తంభాలకు అమర్చిన ప్రైవేట్ సంస్థల ఇంటర్నెట్, కేబుల్‌టీవీ వైర్లను తొలగించాలి. కొన్ని గల్లీల్లో రోడ్ల మధ్యలోనే స్తంభాలు ఉండటం వల్ల రాకపోకలకు ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. వాటిని తొలగించి సురక్షితమైన స్థానాల్లో వేయాలి. డివిజన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో వృథాగా సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటిని తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలి.

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్‌లు..

రామంతాపూర్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో వీధి దీపాలు ఆన్‌ఆఫ్ చేయడానికి అమర్చిన ఫీజు బాక్సులకు ఎలాంటి రక్షణ మూతలు లేకపోవడంతో స్థానికంగా ఉండే చిన్నారులు ఆడుకుంటూ వాటిని పట్టుకుని షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. స్థానిక నెహ్రూనగర్‌లో ఫీజుబాక్స్ మూతలేకుండా ఉందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

కొత్త వాటిని ఏర్పాటు చేయాలి..



కిలోల కొద్ది బరువైన ప్రైవేట్ సంస్థల ఇంటర్నెట్, కేబుల్‌వైర్లు పాత విద్యుత్ స్తంభాలకే అమర్చి ఉన్నాయి. దీంతో అవి ఒంగిపోయి, కిందకు పడిపోయేలా ఉన్నాయి. దీనిపై విద్యుత్ అధికారులకు పలుమార్లు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపడుతాం. – సంతోష్, శ్రీనగర్ కాలనీ

కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తాం..

రామంతాపూర్‌లో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒంగిపోవడం, విరిగిపోవడం వంటివి ఉన్నాయని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి స్తంభాలను గుర్తించి త్వరలోనే కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తాం.
– లావణ్య, ఏఈ, రామంతాపూర్ సబ్‌స్టేషన్